సాక్షి నల్లగొండ

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



ఎక్కువ ఆయకట్టుకు నీరు

ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషిచేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



పదవి లేకున్నా.. ఉన్నట్లే..

తనకు పదవి లేకున్నా.. ఉన్నట్లేనని, వయోభారంతో విశ్రాంతి తీసుకుంటున్నానని మాజీమంత్రి జానారెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	585.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	3,70,309 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	3,45,317 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,826 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	6,006 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,949 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

యూరియా కొరత లేదు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

నల్లగొండ: జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి ఆమె హాజరై మాట్లాడారు. జిల్లాలో సుమారు 70 శాతం మంది రైతులు యూరియాను కొనుగోలు చేశారన్నారు. నానో యూరియాను వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయానికి కాకుండా పరిశ్రమలు, ఇతర పనులకు యూరియా వాడితే క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. యూరియా పక్కదారి పట్టకుండా టాస్క్ ఫోర్స్ కమిటీలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఏఓ శ్రవణ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు ఛాయాదేవి, జిల్లా సహకార శాఖ అధికారి పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ: పోలీస్ గ్రీవెన్స్ డేకు వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 38 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పూర్తి వివరాలు సమర్పించాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. వారి ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చిన్నారుల భద్రతపై నేటి నుంచి టీచర్లకు శిక్షణ

నల్లగొండ: ఈ నెల 19 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు జిల్లాలోని 229 ఉన్నత పాఠశాలల నుంచి 229 మంది టీచర్లకు బాలల భద్రత, అక్రమ రవాణా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని డైట్ కళాశాలలో నాలుగు విడతలుగా శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. మొదటి విడత ఈ నెల 19, 20 తేదీల్లో, రెండో విడత 21, 22 తేదీల్లో, 3వ విడత 28, 29న నాలుగవ విడత సెప్టెంబర్ 8, 9 తేదీల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ముస్లింల శాంతి ర్యాలీ

పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని కోరుతూ సోమవారం నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

- రామగిరి(నల్లగొండ)



బీసీ కోటాపై ఆశలు!

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న ప్రభుత్వం
- పార్టీ పరంగా ఓకే.. ప్రభుత్వ పరంగా తప్పని చిక్కులు
- త్వరలోనే పీఏసీ, కేబినెట్ సమావేశాల్లో కొలిక్కి వచ్చే అవకాశం
- సెప్టెంబర్ మొదటి వారంలోపే జారీ కానున్న ఎన్నికల షెడ్యూల్!



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటా పెంపు అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. బీసీలకు గతంలో ఉన్న రిజర్వేషన్ల కంటే ఈసారి పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహులు ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వపరంగా అమలు విషయంలో అడ్డంకులు ఉండడంతో పార్టీ పరంగా రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తూ ముందుకు సాగేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగబోయే కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో దీనిపై పక్కా అభిప్రాయానికి రానుంది. మరోవైపు రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనూ దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ మొదటి వారంలోపే ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం బీసీలకు ఎన్ని సీట్లు ఉన్నాయి.. ఎన్ని పెరిగే అవకాశం ఉంటుందో అధికార పార్టీతోపాటు ఇతర పార్టీల్లోనూ ఆశావహులు లెక్కలేసుకుంటున్నారు.

భారీ అంచనాల్లో అధికార పార్టీ ఆశావహులు

రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు 2019లో జరిగాయి. 2024లో పాలక వర్గాల పదవీ కాలం ముగిసిపోయింది. అయినా ఇంతవరకు ఎన్నికలు నిర్వహించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతోంది. అయితే ఇందుకు చాలా అడ్డంకులు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్ల పెంపుపై జాతీయ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అందుకు రాష్ట్రపతి ఆమోదం అవసరం. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపినా సానుకూల నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ వివిధ కోణాల్లో ఆలోచనలు చేస్తున్నా, పార్టీ పరంగానే 42 శాతం రిజర్వేషన్ల అమలుతో ముందుకెళ్లే యోచనలో ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏయే మండలాల్లో ఏయే గ్రామాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీలకు అవకాశాలు దక్కుతాయన్న విషయంలో అధికార పార్టీ నేతలు, ఆశావహులు అంచనాలు వేసుకుంటున్నారు.

పెంపు అమలైతే బీసీలకు అధిక స్థానాలు

2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో బీసీలకు 25 శాతం వరకు రిజర్వేషన్లు అమలు చేశారు. స్థానికంగా జనాభా ఆధారంగా 33 శాతం వరకు అమలు చేసే వీలుంది. అయితే అప్పట్లో జిల్లాలో ముందుగా 837 గ్రామ పంచాయతీలకు, ఆ తరువాత మరో 7 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ లెక్కన 209 సీట్లను బీసీలకు కేటాయించారు. వాటిల్లో బీసీలే గెలుపొందారు. అయితే ఈసారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెబుతుండడంతో ఎక్కడెక్కడ అవకాశం లభిస్తుందన్న అంచనాల్లో పడ్డారు. ఈసారి జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 869 ఉండగా, 42 శాతం రిజర్వేషన్ల ప్రకారం 365 సర్పంచ్ స్థానాలు బీసీలకే ఇవ్వాల్సి రానుంది. ఇక అప్పట్లో 346 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 93 స్థానాలు బీసీలకు లభించగా, ఈసారి రిజర్వేషన్ల పెంపు కారణంగా 352 ఎంపీటీసీ స్థానాల్లో 148 స్థానాలు బీసీలకు దక్కనున్నాయి. ఇక ప్రస్తుతం ఉన్న 33 జెడ్పీటీసీ స్థానాల్లోనూ దాదాపు 14 సీట్లు లభించాల్సి ఉంది.

– సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల పరిధిలో 475 గ్రామ పంచాయతీలకు గతంలో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో బీసీలకు 171 స్థానాలు కేటాయించారు. రిజర్వేషన్ల పెంపుతో ఈసారి 200 స్థానాలు బీసీలకే కేటాయించాల్సి వస్తుంది. 255 ఎంపీటీసీ స్థానాల్లోనూ అప్పట్లో బీసీలకు 29 స్థానాలు కేటాయించగా, ఈసారి వందకుపైగా ఎంపీటీసీ స్థానాలు దక్కే అవకాశం ఉంది. 23 జెడ్పీటీసీ స్థానాల్లోనూ పది వరకు బీసీలకు దక్కనున్నాయి.

గ్రీవెన్స్ డేకు కచ్చితంగా రావాల్సిందే..

- హాజరుకాని అధికారులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సీరియస్
- కిందిస్థాయి సిబ్బందిని పంపిన కొందరు
- ఎందుకు రాలేదంటూ సిబ్బందిని ప్రశ్నించిన కలెక్టర్
- అధికారులు రాకుంటే తానొచ్చేది ఎందుకని మండిపాటు



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్రజావాణి కార్యక్రమం (గ్రీవెన్స్ డే)కు హాజరుకాని జిల్లా అధికారులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సీరియస్ అయ్యారు. నల్లగొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆయా సమస్యలను చర్చించేందుకు ఆయా శాఖలకు సంబంధించి ఇద్దరు, ముగ్గురు అధికారుల పేర్లను పిలువగా వారు రాలేదు. వారికి బదులు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గాకుండా ఏ శాఖ నుంచి సిబ్బంది వచ్చారో నిలబడాలని చెప్పడంతో సోషల్ వెల్ఫేర్, మత్స్య శాఖ, చేనేత జౌళి శాఖ, మున్సిపాలిటీ తదితర శాఖలకు సంబంధించిన సిబ్బంది నిలబడ్డారు. అయితే సోషల్ వెల్ఫేర్ డీడీ శశికళను మొదట అడుగ్గా వస్తుందని జూనియర్ అసిస్టెంట్ చెప్పారు. ఆ తర్వాత మరో వ్యక్తిని అడుగ్గా ఆ శాఖ నుంచి ఇద్దరు హాజరయ్యారు. ఇతర శాఖల నుంచి కూడా అధికారికి బదులు ఇద్దరిద్దరు హాజరయ్యారు. దీంతో ఇదేమన్న సినిమానా..బైవన్ గెట్ వన్ లెక్క ఒక అధికారికి ఇద్దరు, ముగ్గురు సిబ్బంది వస్తున్నారు ఇదేమన్న తమషానా అధికారులు గ్రీవెన్స్‌కు హాజరు కాకపోతే నేనొచ్చేది దేనికంటూ సీరియస్ అయ్యారు.

సెలవులు సరిపోవడం లేదా..

సెలవులు వచ్చినయ్. ఇంకా సెలవులు సరిపోవడం లేదా ఎందుకు రాలేదంటూ వచ్చిన సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. అదే సందర్భంలో ఎస్సీ వెల్ఫేర్ డీడీ శశికళ రావడంతో టైమ్ ఎంతయిందంటూ కలెక్టర్ ప్రశ్నించారు. సమయపాలన పాటించాలని ఆమెకు సూచించారు. చేనేత జౌళి శాఖ జూనియర్ అసిస్టెంట్‌ను మీ అధికారి ఎక్కడకు వెళ్లారని అడగ్గా చండూరు వెళ్లారని చెప్పగా ఇక్కడ జిల్లా సమావేశం వదిలిపెట్టి చండూరులో ఏంపని అంటూ మండిపడ్డారు. అదేవిధంగా ఫిషరీస్, కొందరు మున్సిపల్ కమిషనర్లకు బదులుగా సిబ్బంది హాజరు కావడంతో సీరియస్ అయ్యారు. తప్పనిసరిగా అధికారులంతా సమయానికి గ్రీవెన్స్‌కు హాజరు కావాలన్నారు. అధికారులు రాకుంటే నేనెవరితో మాట్లాడాలి. ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయమంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాజరుకాని అధికారులకు ఫోన్ కాల్స్..

హాజరుకాని సంబంధిత అధికారులకు సీసీ ద్వారా ఫోన్ చేయించి హాజరు కావాలని ఆదేశించారు. దీంతో గ్రీవెన్స్ అంతా గతంలో ఎప్పుడూలేని విధంగా అధికారులు మూడు రోజులు సెలవులు వచ్చినా సోమవారం గ్రీవెన్స్‌కు హాజరు కాకపోవడంపై మొదటిసారిగా కలెక్టర్ మండిపడ్డారు. గ్రీవెన్స్ సమావేశాలకు కచ్చితంగా హాజరు కావాల్సిందే అని ఆమె ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రజావాణి కార్యక్రమం హాట్‌హాట్‌గా కొనసాగింది.

అమ్మా.. మా మొర ఆలకించరూ..

- ప్రజావాణిలో కలెక్టర్‌ను వేడుకున్న బాధితులు



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: నల్లగొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి పలు మండలాల నుంచి బాధితులు వచ్చి వివిధ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి పలువురిని నుంచి వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు కొందరు మా మొర ఆలకించి మమ్ములను ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

అమ్మా నాన్న లేరు.. ఆదుకోండి



మాకు అమ్మా నాన్న చిన్నతనంలోనే చనిపోయారు. అప్పటి నుంచి నన్ను, నా సోదరుడి కార్తీక్‌ను నానమ్మ బోడమ్మ కూలిపని చేసి పోషిస్తుంది. మా తాత కూడా చనిపోయాడు. నానమ్మే మాకు ఆధారం. తమ్ముడు 8వ తరగతి చదువుతున్నాడు. నాకు ఆరేళ్ల క్రితమే నరాల వ్యాధితో కాళ్లు, చేతులు పనిచేయడం లేదు. నాకు పెన్షన్ రావడం లేదు. వికలాంగుల పింఛన్ ఇప్పించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– రక్షిత, దివ్యాంగురాలు, పజ్జూర్, తిప్పర్తి మండలం

చార్జింగ్ ట్రైసైకిల్ ఇప్పించాలి



నా కాళ్లు చచ్చుపడిపోయాయి. ఎక్కడికి వెళ్లాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. నా వెంట మరో మనిషి లేకుండా ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో ఉంటూనే కుండలు తయారు చేస్తాను. నాకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. నాపై దయదలిచి నాకు చార్జింగ్ ట్రైసైకిల్ ఇప్పించి ఆదుకోవాలి.

– ఎర్రజెల్ల నాగమ్మ, చండూరు

ఎనిమిది గేట్ల ద్వారా మూసీ ఉరకలు



ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న మూసీ రిజర్వాయర్ నీరు

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. సోమవారం సాయంత్రం వరకు 15,643 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల రిజర్వాయర్‌లో 643.35 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరడంతో అధికారులు ఆదివారం నాలుగు గేట్లు ఎత్తగా సోమవారం మాత్రం ఎనిమిది క్రస్ట్ గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి ఇన్‌ఫ్లోకు సమాంతరంగా 15,442 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా మూసీ కుడి, ఎడమ కాల్వలకు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 4.46 టీఎంసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యంగల రిజర్వాయర్‌లో ప్రస్తుతం 4.03 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

మహాశివుడికి రుద్రాభిషేకం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు విశేషంగా చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలో స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దోమలు పుట్టకుండా.. కుట్టకుండా..

- నీలగిరి బస్తీ కాలనీలపై మున్సిపల్ యంత్రాంగం నజర్
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు కార్యాచరణ
- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచన



నీటి సంపు వద్ద శుభ్రంగా ఉంచుకోవాలని మహిళకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్ : ప్రస్తుత వానాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా వాటి ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అడ్డుకట్ట వేసేందుకు నీలగిరి వార్డుల్లో మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత ఏడాది పట్టణంలోని పలు కాలనీలకు చెందిన వందలాది మంది డెంగీ, చికున్ గున్యా, సీజనల్ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా బస్తీ కాలనీలపై మున్సిపల్ యంత్రాంగం నజర్ పెట్టింది. దీంట్లో భాగంగా పేద, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా నివాసముంటున్న పట్టణంలోని ఏఆర్ నగర్, హిందూపూర్, పాతబస్తీ, అక్కచల్మ, లైన్‌వాడ, కుమ్మరివాడ, మాన్యంచల్క, హైదర్ ఖాన్‌గూడ, అబ్బాసియా కాలనీ, రహ్మత్‌నగర్, షమ్సీనగర్, రాంనగర్, గొల్లగూడ, కేశరాజుపల్లి, బీటీఎస్, కతాల్‌గూడెం, మామిళ్లగూడెం, గంధంవారిగూడెం, అర్బన్ కాలనీ, లెప్రసీ కాలనీ, పానగల్, చర్లపల్లి, ఎన్‌టీఆర్ కాలనీ, గిరకబావి గూడెం, అక్కలాయిగూడెం, ముత్యాలమ్మ కాలనీ, సూర్యవంశీ కాలనీ గుట్ట, వెంకటరమణ కాలనీల్లోని బస్తీ వాసులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

వీటిపైనే అవగాహన..

ఇంటి ఆవరణలో పాత తొట్లు, ఇతర సామగ్రి, తాగి పడేసిన కొబ్బరిబోండాలు, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది, మెప్మా ఆర్పీ, బస్తీల్లో పేదల ఇంటికి వెళ్లివారి ఇంట్లో ఉండే కూలర్లు, పూల కుండీలు, ఇతర పాత సామగ్రిని ఎక్కడ పడితే అక్కడ ఉంచకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఇంట్లోని నీటి సంపులు కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, లేకుండా దోమలు చేరి వాటి ద్వారా డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలుతాయని పేర్కొంటున్నారు. దోమలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చైతన్యపరుస్తున్నారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా జ్వరాలు, ఇతర వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు. ప్రతి ఇంట్లో ఉండే సెప్టిక్‌ట్యాంక్ ఎయిర్ పైపులకు జాలీలు లేకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. దీనిపై ప్రజలకు కనీస అవగాహన లేని కారణంగా సెప్టిక్ ట్యాంక్ ఎయిర్ పైప్‌కు జాలి పెట్టడంలేదు. పట్టణంలో ఒక్క శాతం ఇంట్లో కూడా ఎయిర్ పైప్‌లకు జాలి లేవనే చెప్పాలి. మున్సిపల్ యంత్రాంగం ప్రజలకు జాలీలు అమర్చుకునే విధంగా జాగృత పర్చాల్సిన అవసరం ఉంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

బస్తీ కాలనీల్లో పరిశుభ్రతపై ప్రజలకు మున్సిపల్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఇంట్లోకి సిబ్బంది వెళ్లి పాత సామగ్రి తొలగించడం, కుండీలు, కూలర్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారు. అవసరంలేని వస్తువుల ద్వారా దోమలు ఎక్కువగా వస్తాయి. ఇళ్లలో అవి లేకుండా తొలగించుకోవాలి.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

గోదాములు ఫుల్!

- సీఎంఆర్ దిగుమతికి స్థలం కరువు
- మిల్లుల్లోనే మగ్గుతున్న ధాన్యం
- రంగుమారే ప్రమాదం ఉందంటున్న మిల్లర్లు



నల్లగొండ : బియ్యం నిల్వలతో జిల్లాలోని ఎఫ్‌సీఐ గోదాములన్నీ నిండిపోయాయి. గోదాముల్లో ఖాళీ లేక మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) తీసుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వ గోదాముల్లో ఇప్పటికే బియ్యం నిల్వలు పేరుకుపోవడంతో గత యాసంగి సీఎంఆర్ తీసుకునే విషయంలో ఆలస్యమవుతోంది. దీంతో మిల్లులోనే ఉన్న ధాన్యం రంగుమారే ప్రమాదం ఉందని మిల్లర్లు అంటున్నారు.

ఎఫ్‌సీఐకి ఇచ్చేది బాయిల్డ్ బియ్యమే..

జిల్లాలో నల్లగొండతో పాటు మిర్యాలగూడ, తిప్పర్తి, పెద్దకాపర్తి పరిధిలో ఎఫ్‌సీఐ గోదాములు ఉన్నాయి. ప్రతి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తుంది. మిల్లర్లు మర ఆడించి సీఎంఆర్ కింద పౌర సరఫరాల శాఖకు, ఎఫ్‌సీఐకి ఇస్తారు. పౌర సరఫరాల శాఖకు ఇచ్చే సన్న బియ్యం హాస్టళ్లు, రేషన్ షాపులకు వెళ్తుంది. ఎఫ్‌సీఐ మాత్రం యాసంగి ధాన్యానికి సంబంధించి బాయిల్డ్ బియ్యం తీసుకుంటుంది.

ఇవ్వాల్సిన సీఎంఆర్ 2,24,915 టన్నులు

యాసంగి సీజన్‌లో మొత్తం 6.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఇవ్వగా.. 4,07,300 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. అందుకు సంబంధించి ఇప్పటి వరకు 1,82,618 మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐ తీసుకుంది. ఇంకా 2,24,915 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రోజూ 1,500 టన్నుల బియ్యం తీసుకుంటున్నారు.

ఉన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు పంపిస్తేనే..

జిల్లాలోని గోదాముల్లో ఉన్న బియ్యాన్ని ఎఫ్‌సీఐ ఇతర రాష్ట్రాలకు తరలిస్తేనే మిల్లర్ల నుంచి బియ్యం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం వానాకాలం పంట సాగవుతోంది. ఆ దిగుబడి రాకముందే జిల్లాలో మిల్లర్ల నుంచి సీఎంఆర్ తీసుకుంటే మిల్లుల్లో ఉన్న ధాన్యం ఖాళీ అవడంతో కొత్తగా వచ్చే ధాన్యం నిల్వ చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రైవేట్ గోదాములనైనా అద్దెకు తీసుకుని మిల్లర్ల నుంచి బియ్యం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీఎంఆర్ సేకరణ వేగవంతం చేయాలి

వానాకాలం ధాన్యం వచ్చే నాటికి ప్రభుత్వానికి సీఎంఆర్ అప్పగిస్తే మిల్లుల్లో ఖాళీ ఉంటుంది. దాంతో కొత్తగా వచ్చే ధాన్యం నిల్వ చేసుకోవచ్చు. ప్రైవేట్ గోదాములు తీసుకుని అయినా సీఎంఆర్ సేకరణ వేగవంతం చేయాలి.

– కర్నాటి రమేష్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తాం


జిల్లాలోని గోదాముల్లో 4.05 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంది. ఇప్పటి వరకు 3.90 లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం నిలవ్వలున్నాయి. ప్రస్తుతం ర్యాక్‌లు వచ్చిన వెంటనే ఇక్కడి బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి మిల్లర్ల నుంచి సీఎంఆర్ తీసుకుంటాం.

– సువిన్‌కుమార్, ఎఫ్‌సీఐ డీఎం

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: మండలంలో ఆదివారం రాత్రి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. 52.8 మిల్లీమీటర్లు (5.2 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైనట్లు ఆర్ఐ అజారుద్దీన్ సోమవారం తెలిపారు. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల లోని వరి, పత్తి పంటలు నీట మునిగాయి. శాలిగౌరారం మండల కేంద్రంలో భారీ వరద ప్రవాహం వరిపొలాలను ముంచెత్తింది.

వరిపొలాల మీదుగా పారుతున్న వరద



క్లుప్తంగా

సైన్స్ కాంగ్రెస్‌కు ఎంజీయూ విద్యార్థుల ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పీజీ(బోటనీ) చదువుతున్న విద్యార్థులు వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా జరగనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్–2025లో 'ఎవల్యూషన్ ఆఫ్ యాంటీ మైక్రోబియల్ పొటెన్షియల్ ఆఫ్ బ్లాక్ టర్మరిక్ రైసోమ్ ఎక్స్‌ట్రాక్ట్' అనే అంశంపై చేసిన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు అధ్యాపకురాలు శ్రావ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టు లో భాగంగా ఎన్నుకున్న పరిశోధన పత్రాన్ని సైన్స్ కాంగ్రెస్‌లో సమర్పణకు ఎంపిక కావడం గర్వకారణమని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధనలో భాగస్వాములైన విద్యార్థులు సాంబశివరావు, మౌనిక, గీత, నవనీత, త్రివేణి, స్వప్న, రవళికను అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రేమ్‌సాగర్ అభినందించారు.

గ్రానైట్ తరలిస్తున్న లారీల పట్టివేత

నాగార్జునసాగర్: ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న 18 లారీలను నాగార్జునసాగర్‌లో సోమవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన లారీల్లో కొన్నింటిని హిల్‌కాలనీలోని బుద్ధవనం ముందు గల సిద్దార్థ హోటల్ వద్ద, మరికొన్నింటిని మరో చోట ఉంచారు. నల్లగొండ జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు పోలీసులు సమాచారమివ్వడంతో వారు సాయంత్రానికి సాగర్ చేరుకుని, లారీల డ్రైవర్ల వద్ద గల అనుమతి పత్రాలను చూసి విచారణ చేపట్టారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ అధికారి జాకోబ్‌ను వివరణ కోరగా.. తమ కార్యాలయ సిబ్బందిని నాగార్జునసాగర్‌కు పంపించామని, వారు విచారణ చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఉదయానికి వాటి లెక్కలు తేలుతాయని వివరించారు.

వ్యక్తి అదృశ్యం


సట్టు శ్రీను

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణానికి చెందిన సట్టు శ్రీను ఈ నెల 11న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు సోమవారం నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. శ్రీనుకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటప్పుడు శ్రీను తెల్ల రంగా చొక్కా, నీలి రంగు లుంగి ధరించాడని, ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీను ఆచూకీ తెలిసినవారు 87126 86054, 87126 86012 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

యాదగిరిగుట్ట రూరల్: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకందుకూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు నల్లమాస శంకరయ్య(58) రోజుమాదిరిగానే సోమవారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకు జారడంతో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. శంకరయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు కృషి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


నీటిపారుదల శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో రూ.7.99 కోట్లతో నిర్మించనున్న నీటిపారుదల శాఖ సమీకృత డివిజన్ కార్యాలయం–3 భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అతి తక్కువ ఖర్చుతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించి ఎక్కువ ఆయకట్టుకి సాగు నీరు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్ శాఖలో సంస్కరణలు తెచ్చామని, ఇందులో భాగంగా 1,100మంది ఏఈలు, 1,800 మంది లష్కర్లను నియమించినట్లు చెప్పారు. నీటిపారుదల డివిజన్ పునర్వ్యవస్థీకరణ సమయంలో డివిజన్ నంబర్– 3 పరిధిలో ఉన్న ఇరిగేషన్ సబ్ డివిజన్ నంబర్ 2, 3, 4 కార్యాలయాలు కలిపి హుజూర్‌నగర్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని 2,29,961 ఎకరాలు, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 1,50,181 ఎకరాల ఆయకట్టుతో కూడిన నాగార్జునసాగర్ గ్రావిటీ కాలువలు, ఎత్తిపోతల పథకాల నీటిపారుదల సౌకర్యాలను ఈ కార్యాలయం చూసుకుంటుందని తెలిపారు. ఆరు నెలల్లో ఈ కార్యాలయం నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్‌ఈ నాగభూషణ్‌రావు, ఈఈలు రామకిషోర్, సత్యనారాయణ, తహసీల్దార్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైరు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రూ.2.75 లక్షల నగదు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ నరసింహ


నిందితులను చూపుతున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, పోలీస్ అధికారులు

సూర్యాపేటటౌన్: బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల వద్ద ఫ్రీక్వెన్సీ కేబుల్ వైర్లు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జూన్‌లో నడిగూడెం, మునగాల పోలీస్ స్టేషన్ల పరిధిలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లకు సంబంధించి ఫ్రీక్వెన్సీ కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం మునగాల పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ఆకుపాముల గ్రామం వెళ్లగా.. అక్కడ బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కారులో ఉండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండలం రాజాపూరం గ్రామానికి చెందిన మహంకాళి శ్రీనాథ్, బుడుపుల వంశీకృష్ణగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు నిందితులతో పాటు కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన చలిగంటి శ్రావణ్‌కుమార్ కలిసి సుమారు నాలుగు నెలల కాలంలో తొమ్మిది బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లలో కట్టర్, హ్యాక్‌సా బ్లేడ్ ఉపయోగించి కేబుల్ వైర్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. దొంగతనం చేసిన కేబుల్ వైర్లను కాల్చి దాని నుంచి కాపర్ వైరును తీసి బస్తాల్లో వేసుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లి జీడిమెట్ల, పటాన్‌చెరు ఏరియాల్లో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులు పంచుకుని జల్సాలు చేసేవారని ఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.2.75లక్షల నగదు, 270 మీటర్ల కేబుల్ వైరు, కారు, కట్టర్, హ్యాక్‌సా బ్లేడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రావణ్‌కుమార్‌కు గతంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లలో పనిచేసిన అనుభవం ఉందని, అతడిపై 4 దొంగతనం కేసులు ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. శ్రీనాథ్, వంశీకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. శ్రావణ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. ఈ విలేకరుల సమావేశంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరి రిమాండ్


మల్లికార్జున్


కిరణ్

భూదాన్‌పోచంపల్లి: సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరిని సోమవారం పోచంపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఎస్. లింగోటం గ్రామానికి చెందిన కందగట్ల కిరణ్, చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పస్తం మల్లికార్జున్ స్నేహితులు. వారిద్దరు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలోని హెజిలో కంపెనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పలువురు కార్మికులు పనిచేస్తూ గ్రామ శివారులో అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 15న రాత్రి తలుపులు పెట్టుకోకుండా నిద్రించడాన్ని గమనించిన కిరణ్, మల్లికార్జున్ గుట్టుచప్పుడు కాకుండా వెళ్లి 6 సెల్‌ఫోన్లు అపహరించి పరారయ్యారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం అంతమ్మగూడెం ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నంబర్‌ప్లేట్ లేని స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తున్న కిరణ్, మల్లికార్జున్ పట్టుకొని విచారించారు. వారు సెల్‌ఫోన్లు చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్కూటీని సీజ్ చేశారు. అనంతరం చౌటుప్పల్ కోర్టులో రిమాండ్ చేయగా, మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు నల్లగొండ జైలుకు తరలించారు. కిరణ్, మల్లికార్జున్‌పై గతంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో 20కి పైగా చోరీ కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఇటీవల చౌటుప్పల్‌లో ఓ వాహనాన్ని కూడా దొంగిలించారని ఎస్‌ఐ తెలిపారు.

- హైవేపై వాహనాల బారులు



చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్: విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ పెరిగింది. ఈనెల 15 నుంచి వరుసగా సెలవులు రావడంతో పాటు ఆదివారం చాలా గ్రామాల్లో బోనాల పండుగ ఉండడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు సోమవారం తిరుగుపయనమయ్యారు. దీంతో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం

భువనగిరిటౌన్ : రైలులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సోమవారం భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సర్వేష్ అనేమియా సర్కార్ భువనగిరి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం సుమారు రెండు గంటల పాటు అతడిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా.. గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 15 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ తెలిపారు. నిందితుడిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు పోలీసులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

- క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స
- సకాలంలో ఆస్పత్రికి తరలింపు


ఘటనా స్థలంలో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న ఆలేరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు

ఆలేరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటారు ఆలేరు పోలీసులు. ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పేట సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఇక్కుర్తి గ్రామానికి చెందిన వంగాల మధుసూదన్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తూ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో బహదూర్‌పేటలో ఎమ్మెల్యే కార్యక్రమానికి బందోబస్తులో పాల్గొని తిరిగి ఆలేరు పోలీస్ స్టేషన్‌కు వస్తున్న కానిస్టేబుళ్లు సైదులు, ప్రసాద్, నవీన్, అశోక్ రోడ్డు పక్కన గాయాలతో ఉన్న మధుసూదన్‌రెడ్డిని చూశారు. వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 వాహనానికి ఫోన్ చేసి, ఆస్పత్రికి సకాలంలో తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త


సుజాత (ఫైల్)


రాజాపేట: కుటుంబ కలహాలతో భార్య గొంతు నులిమి భర్త హత్య చేశాడు. ఈ ఘటన రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామంలో జరిగింది. సోమవారం ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టగూడెం గ్రామానికి చెందిన ముడావత్ అమృకు అదే గ్రామానికి చెందిన సుజాతతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. వీరు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు గ్రామస్తుల మధ్య పంచాయితీ పెట్టి మాట్లాడుకున్నారు. కాగా ఆదివారం రాత్రి సుజాత(35) ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామస్తులు గమనించి సుజాత తల్లి పింప్లికి సమాచారం ఇచ్చారు. సుజాత తల్లి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శంకర్‌గౌడ్ క్లూస్‌టీంను పిలిపించి వివరాలు సేకరించారు. భర్త అమృనే సుజాత గొంతుకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి చంపినట్లు గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డిండికి 13,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

డిండి: ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టు అలుగుపోస్తోంది. ప్రాజెక్టులోకి వరద ప్రవాహం సోమవారం మళ్లీ పెరిగింది. దీంతో దుందుభి వాగు ద్వారా ప్రస్తుతం ప్రాజెక్టులోకి 13,200 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.


అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టు

10 గేట్ల ద్వారా నీటి విడుదల


పులిచింతల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు నీటి మట్టం సోమవారం రాత్రి వరకు పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,55,668 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 10 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 3,10,060 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నాకు పదవి లేకున్నా.. ఉన్నట్లే

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


వెల్మగూడెంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో కలిసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

పెద్దవూర: తనకు పదవి లేకున్నా.. ఉన్నట్లేనని, వయోభారంతో విశ్రాంతి తీసుకుంటున్నానని, తన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న తన కుమారులతో కలిసి అభివృద్ధిలో భాగస్వాముడిని అవుతానని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దవూర మండలం గర్నెకుంట, వెల్మగూడెం గ్రామాల్లో మాజీ సర్పంచ్ దాచిరెడ్డి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎస్ రెడ్డి (దాచిరెడ్డి వెంకట నర్సింహారెడ్డి) సోదరులు రూ.12లక్షల సొంత ఖర్చులతో నిర్మించిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌లను సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. సొంత నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలకు అప్పగించడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి మాధవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. రెండేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని, ఇళ్లు రాలేదని ఎవరూ బాధపడవద్దని సూచించారు. ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధచూపుతూ నాకంటే ఎక్కువ మన్ననలు పొందాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి సూచించారు. వారంలో రెండు రోజులు మద్యం తాగడం బంద్ చేసి ఆ డబ్బులతో హెల్త్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని తనతో పాటు డీవీఎస్ రెడ్డి కూడా కొంత సహాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అబ్బిడి కృష్ణారెడ్డి, బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ధర్మారెడ్డి, బోయ నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, రామలింగయ్య, నాగరాజు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రమించే విద్యార్థులకే ఉపాధి అవకాశాలు

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి శ్రమించే విద్యార్థులకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇంజనీరింగ్ కోర్సుల విధివిధానాలు, ప్లేస్‌మెంట్ సెల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెల్, ఇన్‌స్టిట్యూట్ ఇండస్ట్రీ కనెక్ట్, స్టూడెంట్ వెల్ఫేర్ విభాగాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు 75 శాతం హాజరు పాటిస్తూ విశ్వవిద్యాలయం అందించే కరిక్యులం, నైపుణ్యాల పెంపునకు ఏర్పాటు చేసిన సదుపాయాలు ఉపయోగించుకోవాలని సూచించారు. టెక్నాలజీని లక్ష్యసాధనకు వినియోగించి వ్యసనాల బారిన పడకుండా యువత దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి, అధ్యాపకులు రేఖ, ఎం. జయంతి, టి. మౌనిక, అవినాష్, హరీష్ కుమార్, విజయ్‌కుమార్, రామచంద్రుడు, డైరెక్టర్లు వై. ప్రశాంతి, శ్రీదేవి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలకు..


మాట్లాడుతున్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల విద్యార్థులు

- విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి: నిరంతర సాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్ ఫస్టియర్ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని చెప్పారు. 75శాతం మంది విద్యార్థులకు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ వందశాతం ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని అన్నారు. చదువుతో పాటు విద్యార్థుల్లో సామాజిక దృక్పథం, మనోవికాసం, సేవా కార్యక్రమాలు, టీమ్ స్పిరిట్ పెంచడానికి తరచూ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ ఐఏఎస్ అధికారిణి, యూనివర్సిటీ అడ్వైజర్ డాక్టర్ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టనష్టాలు, ఒడిదొడుకులు అన్నింటిని ఎదుర్కొన్నప్పుడే వారు మానసిక పరిపూర్ణత సాధిస్తారని అన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వీఎంవీ రావు మాట్లాడుతూ.. పట్టుదలను పెట్టుబడిగా పెడితే లక్ష్యసాధన సులభతరం అవుతుందని అన్నారు. మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉపాధి రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాజాపై దాడులు విరమించుకోవాలి


నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్దకు ర్యాలీగా వచ్చిన ముస్లింలు

- నల్లగొండ పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించిన ముస్లింలు

రామగిరి(నల్లగొండ): పాలస్తీనాలోని గాజా నగరంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను విరమించుకోవాలని ముస్లిం సంఘాల నేతలు కోరారు. గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ ముస్లిం మతపెద్దలు మౌలానా సయ్యద్ ఎహసానుద్దీన్, మౌలానా యాసర్ హుస్సేన్, మౌలానా ముఫ్తీ సిద్దీఖ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. సేవ్ గాజా అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా క్లాక్‌టవర్ సెంటర్‌లో పలువురు మాట్లాడుతూ.. గాజా ప్రజలపై యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. యుద్ధం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హఫీజ్‌ఖాన్, అహ్మద్ కలీం, సామాజిక కార్యకర్త పి. దేవి, నాగార్జున, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సేవ్ గాజా అనే అక్షరాలను ప్రదర్శిస్తున్న ముస్లింలు


నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేస్తున్న ముస్లింలు